# పుట్టి

సాంబయ్య మీకూ తెలుసు గదా? అతను సోమరిపోతని, అతగాడి శత్రువులు సైతం అనరు గదా? అతని పొలం గూడా, చారెడు చల్లితే చాటెడు పండుతుంది గదా? భార్యా బిడ్డల వేపన్నా చూడటం మరచి పోతాడేమో తప్ప — తనకున్న ఆ అరక పొలాన్ని చూడకుండా, గంగ కూడా ముట్టడు గదా? తను తిన్నా, తినకపోయినా, నేల తల్లికి లోటుపాట్లు రానీదు గదా? కడుపు నాయ గట్టుకొని, గట్టు మీద పడుకున్న రోజులూ ఉన్నాయి గదా? కళ్ళు మూసుకొని, అలా వేళ్ళతో సున్నితంగా స్పృశించి, తన పొలం మట్టి ఏదో — కాని దేదో, ఖరా ఖండీగా చెబుతాడు గదా? అలాంటి సాంబయ్య పొలం ఈ సంవత్సరం ఈటు పోవటమేమిటండీ? ఎక్కడ ఏం లోపం చేశాడు గనక? ఎప్పుడు ఏం పొరపాటు చేశాడు గనుక?

పదెకరాల మీదా - తక్కువలో తక్కువ పది పుట్లూ పండుతా యనుకున్నాడు. పండినట్లే ననుకున్నాడు - అదేం పోడుగాలి సోకిందో ఏం పాడో - నిక్కి నీలిగీ చూస్తే - పొల్లూ నెల్లూతో కలుపు గుంటే - ఒక్క "పుట్టి" తూగేసరికి తాతలు దిగొచ్చారు.

ఇదిలా ఉణ్ణండి -

అతగాడి ఇంటికి పగ్గం దూరంలోనే బసవయ్య మండువా ఉంది. కావడానికి బసవయ్య మంచివాడు. అదృష్టవంతుడు. అతనికి

వరసగ్గా ముగ్గురు మగ పిల్లలు. నాలుగో వాడు కూడా, మగ పిల్లాడయితే బసవయ్యకే దిగులు లేకపోను. కానీ భగవంతుడు ఇంకోలా ఆలోచించాడు. అస్తమానూ బసవయ్యా చెప్పినట్లే వినడం ఓనికనుకొన్నాడేమో - ఒక సారి కనకమ్మ మాట కూడా విందామనుకొన్నాడా దేముడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. బసవయ్యగారి ముగ్గురు కొడుకులూ, రత్నాల్లాంటి వాళ్ళే! వారూ - వీరూ - చదవెయ్యమని అన్నారు గానీ, బసవయ్య ఒప్పుకోలేదు. ఎందుకొప్పుకోవాలి? తన ముత్తాత చదువుకో లేదు. తన తాత చదువుకో లేదు. తన అయ్య చదువుకో లేదు. తనూ చదువుకో లేదు. వీరందరూ ఏ చదువూ లేకుండానే సుఖంగా బతికినప్పుడు, తన పిల్లలు మాత్రం ఎందుకు సుఖంగా బతకరు?

బసవయ్య మంచివాడే! సందేహం లేదు. కాని మొండిఘటం. ఆయనకేం తోస్తే అదే నిజం. ఆ నిజానికి, అరంగుళం మేర అటూ ఇటూ కూడా ఆయన గారు తొలగరు.

కొడుకుల చదువు గురించి కన్నా, తనకు ఆడ నలుసు కూడా లేనందుకు, కనకమ్మగారు — అక్షరాలా బాధ పడ్డారు. ఆవిడ గారు కన్నీరు మున్నీరుగా ఏడవని మాట నిజమే గానీ - కళ్ళు తుడుచుకున్న సందర్భాలు బోలెడు. ఏ ఆడపిల్ల వొంకులు జడ వేసుకున్నా, కనకమ్మ గారి గుండె నిండా పాలు పొంగేవి. ఆవిడకా ముచ్చట తీరక - మగ పిల్లలకే జడలు వేసి, పూలు తురిమి, లంగాలు ఓణీలు వేసి, మొగుడికి తెలియకుండా ఫోటోలు కూడా తీయించి దాచుకొంది.

ఈ మోజు చూసి - భగవంతుడు కూడా అమితంగా జాలి పడి ఉండాలి. నాలుగో కాన్పులో, కనకమ్మ గారికి బంగారుతల్లి

పుట్టింది. నిజంగా జానకి బంగారు బొమ్మ. పచ్చగా బొద బొద లాడుతూ ఉంటుంది. కూతురుకు పేరు పెట్టే విషయం కూడా కనకమ్మ గారు, చాలా దూరం ఆలోచించి ఆలోచించి, "జానకి" అని ఉండాలన్నది. ఆ పేరే అమ్మాయికి అచ్చి వస్తుందని చెప్పిన శాస్త్రుల్లు గారికి, ఓ బస్తా వడ్లు పంపించిన సంగతి బసవయ్యకు తెలియనే తెలియదు.

కొడుకులు చదువుకున్నా చదువుకోక పోయినా అట్టే పట్టించుకోని కనకమ్మ, కూతురు చదువు విషయంలో మాత్రం అంత ఉదాసీనంగా లేదు. లేదు సరే గదా - బళ్ళో చెప్పిన చదువు సరిపోదేమోనని, ఉదయమూ సాయంకాలమూ, ప్రయి వేటు కూడా చెప్పించింది. జానకి, అక్షరాలు కూడబలుక్కుంటూ ఒక్కో వాక్యమూ అంటున్నప్పుడూ, ఒక్కో పద్యాన్ని పాటికి పదిసార్లు చదువుతున్నప్పుడూ, కనకమ్మగారి హృదయం, అమంద మైన ఆనందంతో కందళించింది.

...కనకమ్మ గారికి, ఈ మాయ కాలపు పోకు లేమీ తెలీక పోవచ్చు గానీ, ఆవిడ అమాయకురాలేం కాదు. జానకిని ఉత్తి పుణ్యానికే చదివించడం లేదు. ఆవిడ చిన్న తమ్ముడు - రాముడు - అదే రాంబాబు - ఆవిడ దృష్టిలో ఉన్నాడు.

తన తమ్ముళ్ళందరిలోకీ రాముడంటే కనకమ్మ గారికి వల్ల మాలిన అభిమానం. ఇందుక్కారణం - వాడు తల్లి గండాన పుట్టడం కావచ్చు. ఇంతప్పట్నించీ - తన దగ్గరే పెరగటమూ కావచ్చు. తన కొడుకులకన్నా మిన్నగా, రాముణ్ని చూసిందనడం అబద్ధమేగానీ, వాణ్నెప్పుడూ మరో ఇంటి వాడిలాగానూ కనకమ్మగారు చూడలేదు.

ఏం?

తప్పేముంది ?

భగవంతుడి దయ వల్ల ఇంకో ఆరు మాసాలు కళ్ళు మూసుకొంటే, రాముడు ఆఖరు పరీక్ష రాసేస్తాడు. ఈ లోగా జానక్కి పరీక్షలు కూడా అయిపోతాయి. ఓ మంచి రోజు చూసి వాళ్ళిద్దరకూ ముడి పెట్టేస్తే - ఇంక దిగులంటూ ఉండదు...

కాని రాముడు దిగులు కలిగించే తీరాడు. వాడు జానకిని చేసుకో నన్నాడు. ఎందుకు చేసుకోవడం లేదో తెగేసి చెప్పాడు. కనకమ్మ గారి "పుట్టి" నడేట్లో మునిగింది! ఆవిడ కుప్ప కూలిపోయే అవకాశం కూడా ఇవ్వకుండా రాముడు, అవతలి కెళ్ళిపోయాడు.

ఈ సంగతి - రాముడు తనను "కా" దన్న సంగతి - జానక్కి తెలుసునో లేదో మనకు తెలీదు. ఆ పిల్ల - అసలిదేమీ జరగనట్లే తల్లి దగ్గర కొచ్చి, ఏదో చెప్పబోయింది.

"నువ్వు పుట్టక పోతే నాకొక టే పడుపు. 'పుట్టి' నాలుగు రకాలుగా పడిపిస్తున్నావే పాపిష్టిదానా!" అన్నది కనకమ్మ కూతుర్ని కావలించుకొని భోరు మంటూ.

జానకి ఉలకనూ లేదు-

పలకనూ లేదు.

సన్నగా మాత్రం నిట్టూర్చింది.